
andhrajyothy.com
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 27.8, కనిష్ఠం 5.2

ఆంధ్రజ్యోతి



ఆదిలాబాద్
జిల్లా వార్తలు

5

మంగళవారం 17 డిసెంబరు 2024

'పంటల వివరాలు నమోదు చేసుకోవాలి'

తలమడుగు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రబీ పంటలు సాగు చేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా పంటలు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని. మండల వ్యవసాయ అధికారి ప్రమోద్ రెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ. రబీ పంటలు సాగు చేస్తున్న రైతులందరూ తమ పంటల వివరాలను డిజిటల్ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో మోతే శ్రీనివాస్, సిబ్బంది సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లోని ఐటీడీఏకు ర్యాలీగా తరలివస్తున్న కోలాం ఆదివాసీ గిరిజనులు

కోలాం గిరిజనుల ఐటీడీఏ ముట్టడి ప్రశాంతం

- పోలీసుల భారీ బందోబస్తు
- రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్

ఉట్నూర్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మన్నేవార్లకు కేటాయించిన కోలవార్ పదమును ప్రభుత్వం తొలగించాలని కోరుతూ ఆదిమ గిరిజన కోలామ్ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం తలపెట్టిన చలో ఐటీడీఏ ముట్టడి ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి జిల్లాలోని కోలాం గిరిజనులు వేల సంఖ్యలో ఉట్నూర్‌కు తరలివచ్చారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని కోలాంసేవ సంఘం భవనం వద్ద చేరుకున్న అనంతరం.. గిరిజన భవన్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు

(తరువాయి 6వ పేజీలో...)



అడవుల అందాలు అదరహో!

- జిల్లాలో కనువిందు చేస్తున్న ప్రకృతి సోయగాలు
- కొండల మధ్య నాట్య మయూరాలు
- జింకలు, పెద్దపులుల సంచారం

7 లో



- జిల్లాలో ఆగని మొరం అక్రమ తవ్వకాలు
- మైనింగ్ మాఫియాకు అధికారుల అండదండలు
- నిత్యం లక్షల రూపాయల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి
- తేలికగా తీసుకుంటున్న రెవెన్యూ, మైనింగ్ అధికారులు

బొందలగడ్డలుగా.. అసైన్డ్ భూములు

ఆదిలాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మైనింగ్ మాఫియా ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. అక్రమ తవ్వకాలతో అసైన్డ్ భూములు బొందల గడ్డలుగా మారుతున్నాయి. ల్యాండ్ లెవలింగ్, అభివృద్ధి పనుల పేరిట దర్జాగా అక్రమదందా చేస్తున్న అడిగే వారే కరువవుతున్నారు. జిల్లాలో నేరడిగొండ, కుప్టి, తలమడుగు మండలం కజ్జర్ల, దేవాపూర్, తాంసి మండలం పొన్నారి, మావల మండలం బట్టిసావర్గాం గ్రామ శివారుల్లో మొరం అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. రాత్రి, పగలు అనే తేడా లేకుండా నిత్యం వందలాది వాహనాలు మొరం మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు అక్రమార్కులు ఇదే దందాను ఉపాధిగా మల్చుకుంటున్నారు. నిత్యం పట్టపగలే మొరం అక్రమ తవ్వకాలు సాగుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ఎక్కువగా నల్లరేగడి భూములే కావడంతో ఎర్రమట్టి మొరంకు భారీగా డిమాండ్ ఏర్పడుతోంది. దీంతో కిలోమీటర్ల దూరంలో ఉన్న గుట్టలు, అసైన్డ్ భూములను అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. ప్రైవేట్ పట్టా భూముల్లో తవ్వకాలు చేపడితే అధిక ఖర్చు కావడంతో మైనింగ్ మాఫియా కన్ను నిరుపేదల అసైన్డ్ భూములపై పడుతోంది. ఎంతో కొంత ఇచ్చి అసైన్డ్ భూముల్లో మొరం తవ్వకాలు చేపడుతున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా.. రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోవడమే లేదని స్థానికులు చెబుతున్నారు.



మైనింగ్ మాఫియా ధన దాహానికి అసైన్డ్ భూములు భారీ గుంతలు, బండరాళ్లతో దర్శనమిస్తున్నాయి. అధికారులు దృష్టి సారించక పోవడంతో నిత్యం లక్షల రూపాయల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై జిల్లా మైనింగ్ ఏడీని ఫోన్‌లో సంప్రదించగా స్పందించ లేదు.

రాయల్టీ పన్ను ఎగవేత

నిబంధనల ప్రకారం మొరం తవ్వకాలపై రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి వచ్చే లక్షల రూపాయల ఆదాయానికి గండికొడుతున్నారు. రాయల్టీ పన్నును యథేచ్ఛగా ఎగవేస్తున్నారు. మొరం తవ్వకాల పైన అంతంత మాత్రంగానే ఆదాయం వస్తున్నట్లు తెలుస్తుంది. అయినా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయి. అసలు నిబంధనల ప్రకారం ఒక్కో క్యూబిక్ మీటర్‌కు కంకర తవ్వకాలపై రూ.75, మొరం తవ్వకాలపై రూ.35, ఇసుక తవ్వకాలపై రూ.45 చొప్పున ప్రభుత్వానికి రాయల్టీ పన్నును చెల్లించాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో రాయల్టీని చెల్లించిన దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. 600 ఫీట్ల సామర్థ్యం ఉన్న టిప్పర్‌లో 6క్యూబిక్ మీటర్ల మొరంను తరలించవచ్చు. ఈ లెక్కన ఒక్కో క్యూబిక్ మీటర్‌కు రూ.35 చొప్పున 6 క్యూబిక్ మీటర్లకు రూ.210 చెల్లించాల్సి ఉంటుంది. ఇలా నిత్యం వందలాది సంఖ్యలో ట్రిప్పుల మొరం తరలిపోవడంతో ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూరుతోంది. కానీ మైనింగ్ మాఫియా రాయల్టీ పన్నును ఎగవేస్తూ.. అందినకాడికి జేబులో వేసుకుంటున్నారు. కొంతమంది వ్యాపారులకు రాజకీయ పార్టీ నేతల అండదండలు ఉండడంతో అధికారులు కూడా చర్యలు

(తరువాయి 6వ పేజీలో...)

గ్రూప్-2 పరీక్షా కేంద్రాల తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా



కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ గౌస్ ఆలం

- పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ
- రెండోరోజు 4654 మంది అభ్యర్థుల గైర్హాజరు

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్-2 పరీక్షా కేంద్రాలను సోమవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షనిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాలు, అభ్యర్థుల హాజరు శాతం, తదితర వాటిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షలు పకడ్బందీగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రెండవ రోజు 10,428 అభ్యర్థులకు గాను 5774 అభ్యర్థులు హాజరై 4654 అభ్యర్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలోని 29 కేంద్రాల్లో గ్రూప్-2 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నట్లు జిల్లా ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. పట్టణంలోని పలు పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల లోపల, పరిసర ప్రాంతాలలో క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమల్లో ఉందని తెలిపారు. ఎలాంటి సభలు, ర్యాలీలు, సమావేశాలకు అనుమతులు లేవని పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలను పర్యవేక్షిస్తూ నిరంతరం పెట్రోలింగ్ గస్తీ నిర్వహిస్తుండాలని సూచించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ ప్రాముఖ్యత ఎంతో ఉంది : కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి) : నిత్యజీవితంలో సైన్స్‌ప్రాముఖ్యత ఎంతో ఉందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. సోమవారం ఆదిలాబాద్‌లోని టీటీడీసీలో నిర్వహించిన జనవిజ్ఞాన వేదిక రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల ముగింపు వేడుకల్లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ బహుమతులు ప్రదానం చేశారు. సైన్స్ వెనుక దాగి ఉన్న విషయాలను అర్థం చేసుకోవాలని తెలిపారు. చదువుతోనే ఏమైనా సాధ్యమన్నారు. ఎన్ని సమస్యలు వచ్చిన చదువు వదల కూడదన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రఘు రమణ, డాక్టర్ తంగరాజన్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ, రాష్ట్ర నాయకులు రవీందర్ రెడ్డి, శ్రీనథ్, లక్ష్మారెడ్డి, బీఎస్ రెడ్డి, సత్యం, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఉమాకాంత్, పెంటపర్తి ఊశన్న, వీరన్న, గంగన్న, శ్రీధర్‌బాబు, నాగరాజు, సంతోష్, గంగన్న, శంకర్ రెడ్డి, వినోద్ రెడ్డి, ప్రేమ్‌కుమార్, బాబన్న పాల్గొన్నారు.

క్రీడాకారులు రాణించాలి ...

ఆదిలాబాద్‌అర్బన్ : జిల్లా లెవల్ సీఎం కప్ -2024 క్రీడలను సోమవారం జిల్లా కలెక్టర్ రాజార్షిషా ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో సీఎం కప్ -2024 క్రీడలను విజయవంతంగా పూర్తి చేసుకుని జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన విద్యార్థులను అభినందించారు. జిల్లాస్థాయి పోటీలలో రాణించి రాష్ట్ర స్థాయిలో ఈ నెల 27 నుంచి జనవరి 2వరకు నిర్వహించే క్రీడల్లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలవాలని కోరారు. ఈ పోటీలు ఈ నెల 16 నుంచి 21 వరకు వివిధ రకాల క్రీడాపోటీలు జరుగుతాయన్నారు. జిల్లాస్థాయిలో కబడ్డీ,ఖోఖో, అథ్లె టిక్స్, బ్యాడ్మింటన్ బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్,చెస్, బాక్సింగ్, స్విమ్మింగ్‌లతో పాటు ఇతర క్రీడలుంటాయన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ టాస్‌వేసి క్రీడ లను ప్రారంభించి క్రీడాకారులకు బెస్ట్‌ఆఫ్ లక్ తెలిపారు. ఇందులో డీవైఎస్‌ఓ వెంకటేశ్వర్లు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫీసర్ పార్థసారథి, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు గోవర్ధన్‌రెడ్డి, బండారుదేవన్న పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా

కోడిపిల్లలతో పాటు బుట్టల పంపిణీ



కోళ్లు, బుట్టలను పంపిణీ చేస్తున్న పీవో ఖుష్బుగుప్తా

ఉట్నూర్, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళాశక్తి పథకంలో భాగంగా ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని కొమురంభీం ప్రాంగణంలో మహిళా సంఘాల ద్వారా పెంచుతున్న కోడిపిల్లలను పెరటి కోళ్ల పెంపక లబ్ధిదారులకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా సోమ వారం పంపిణీ చేశారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ప్రభుత్వం ఈ ఇందిరా మహి ళాశక్తి కార్యక్రమాన్ని చేపట్టిందని తెలి పారు. ఉట్నూర్‌లోని కొమురంభీం ప్రాంగణంలో ఐటీడీఏ తరపున ఉన్నటువంటి రెండు కోడి పిల్లల పెంపక కేంద్రాలను (పౌల్ట్రీ యూనిట్స్) మహిళా సంఘాలకు కేటాయించినట్లు తెలిపారు. వీటితో పాటు భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఆర్) హైదరాబాద్‌లోని కోళ్ల పరిశోధన కేంద్రం ఆధ్వర్యం లో పంపిణీ చేసిన రక్షకబుట్టలు (నైట్‌షెల్టర్స్)లను కూడా ప్రాజెక్టు అధి కారి పంపిణీ చేశారు. వీటిలో 45 రోజులుగా పెంచిన కోడిపిల్లలను లబ్ధి దారులకు సోమవారం సాయంత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ నాటు కోళ్లకు బహిరంగ మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకుని కోడిపిల్లలను పెంచుకున్నట్లయితే మహిళలు ఆర్థికంగా లబ్ది పొందుతారని అన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధి కారి గుడిమల్ల సందీప్‌కుమార్, ఐకేపీ ఏపీఎం అనిల్, ఐకేపీ సిబ్బంది చంద్రకళ, లబ్ధిదారులు, ట్రైనర్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

గురుకులం తనిఖీ చేసిన అధికారులు



తనిఖీ చేస్తున్న అధికారులు

ఉట్నూర్, డిసెం బరు16 (ఆంధ్రజ్యోతి):జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏజెన్సీ వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్‌కుడిమెత మనోహర్ సోమవారం ఉట్నూర్ మండలంలోని లాల్‌టేకిడి గిరిజన గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం నాణ్యమైన చదువుతో పాటు నాణ్యమైన భోజనం అందించడానికి కృషి చేస్తున్నందున విద్యార్థులకు మెనూ ప్రకా రం భోజనాలు పెట్టాలని, భోజనానికి ఉపయోగించే ఆహార వస్తువులు నాణ్యతగా ఉండాలని ఆదేశించారు. దీంతో గురుకుల పాఠశాలకు సరఫరా అవుతున్న ఆహార వస్తువులు, నూనెలు నాణ్యతగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ఆయన వెంట హస్నాపూర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శికారిసాయికుమార్, హెల్త్‌అసిస్టెంట్ కిషన్ తదితరులున్నారు.

అన్నదానం నిర్వహించిన ముస్లిం యువకుడు



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న స్వాములు

భీంపూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన ముస్లిం యువకుడు మూడుసంవత్సరాల నుంచి అయ్యప్ప స్వామి దీక్షాపరులకు అన్నదానం నిర్వహిస్తూ ఐక్యతను చాటుకున్నారు. పిప్పలకోటి గ్రామానికి చెందిన షేక్‌మతిన్ అనే యువకుడు సోమవారం మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి భక్తులకు మహాఅన్నదాన కార్యక్రమాన్ని చేపట్టి ఆదర్శంగా నిలిచారు.

సీఆర్టీల నిరవధిక సమ్మె

ఉట్నూర్, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షి టీచర్లకు (సీఆర్టీ) ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు టైంస్కేల్ కల్పించాలని కోరుతూ ఉమ్మడి జిల్లాలోని గిరిజనసంక్షేమ శాఖ సీఆర్టీల సంఘం ఆధ్వర్యంలో సోమ వారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె ప్రారంభించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు మరుసు కోల తిరుపతి సీఆర్టీ సంఘ నాయకులకు పూలదండలు వేసి తిరుపతి సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా మారుమూల గిరిజన గ్రామాలలో సీఆర్టీలుగా విధులు వేస్తున్న వారిని ప్రభుత్వం విస్మరిస్తుందన్నారు. ప్రభుత్వం సీఆర్టీలను రెగ్యూలర్ చేయాలని, ప్రతినెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని, మహిళ సీఆర్టీలకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు వర్తింపచేయాలని, సీఆర్టీలకు ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యాన్ని కల్పించాలని, సీఆర్టీలకు హెల్త్‌కార్డు సౌకర్యాన్ని అందించాలని తదితర డిమాండ్లను ప్రకటించారు. సీఆర్టీల నిరవధిక సమ్మెకు టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో గుడంశ్రీనివాస్, వినంత్‌రావు, సోమేశ్వర్, రమేష్, వంశీకృష్ణ, కమలాకర్, రమచందర్, విద్యారాణి, వందన నాయకులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌ఐటీడీఏ ముందు నిరవధిక సమ్మె ప్రారంభించిన సీఆర్టీలు

'ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి'

ఉట్నూర్, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి ఈనెల 15న ప్రారంభించిన ఆశావర్కర్ల బస్సుజాత 33 జిల్లాల్లో పర్యటించి 31న ఇందిరా పార్కువద్ద బస్సుజాత ముగింపు జరుగుతుందని, ఈ సందర్భంగా భారీధర్నా నిర్వహించనున్నామని సీఐటీయూ అనుబంధ సంఘమైన ఆశావర్కర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి తెలిపారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కొమురంభీం ఆసిఫాబాద్ మంచిర్యాల జిల్లాలకు వెళ్తు విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వకాలంలో ఆశావర్కర్లు, ధర్నాలు రాస్తారోకోలు చేస్తే తమ ఆందోళనలకు కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతు ఇచ్చిందన్నారు. అధికారంలోకి వస్తే ఆశావర్కర్లకు వేతనాలు ప్రకటించి ఉద్యోగభద్రత కలిగిస్తామని హామీ ఇవ్వడంతో పాటు ఎన్నికల మెనిఫెస్టోలో చేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి యేడాది కావస్తున్నా ఆశావర్కర్ల సమస్యల పరిష్కారానికి ఊసుఎత్తడం లేదని ఆరోపించారు. ప్రతిరోజు రెండు జిల్లాలు పర్యటించి రాష్ట్ర వ్యాప్తంగా ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ప్రజ లకు తెలియజేస్తామన్నారు. 24గంటలు ప్రజలకు అందు బాటులో ఉంటూ సేవలు అందిస్తున్న ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. అవసరమైతే నిరవధిక సమ్మెకు వెళ్తామన్నారు.

కార్మికులకు మైక్రోఫైనాన్స్ సిబ్బంది వేధింపులు



బాధితురాలితో వాగ్వాదం చేస్తున్న ఫైనాన్స్ సిబ్బంది

నేరడిగొండ, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): ఎక్కడికి వెళ్లినా వదిలి పెట్టేది లేదని మైక్రోఫైనాన్స్ సిబ్బంది సోమవారం మండలంలోని దర్శన్‌జిన్నింగ్ మిల్లులో రాద్ధాంతం చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రం అంబేద్కర్‌నగర్‌కు చెందిన మనిషా బతుకు దెరువు కోసం కూలీ పనిచేస్తుంది. కాగా సంబంధిత మైక్రోఫైనాన్స్ రికవరీ సిబ్బంది జిన్నింగ్ మిల్లుకు వచ్చి డబ్బులు కట్టాలి అని బలవంతం పెట్టారు. దాడులకు సైతం పాల్పడుతున్నారని మనిషా ఆరోపించింది. రెండునెలల నుంచి ఆరోగ్యం బాగా లేనందున కట్టలేదని, భర్తతో కలిసి ఇద్దరం జిన్నింగ్ మిల్లులో పనిచేసి అప్పులు తీర్చుతామన్నా సిబ్బంది వినడం లేదని వాపోయారు. మైక్రోఫైనాన్స్‌లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

'తప్పులు లేకుండా ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేయండి'

తాంసి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశానుసారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో తప్పులు లేకుండా సర్వేచేయాలని ఎంపీడీవో మోహన్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలో ఇళ్ల సర్వే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి సొంత ఇల్లు లేని వారి వివరాలు సేకరించారు. ఇల్లు కట్టుకునేందుకు ఖాళీ స్థలం ఎంతవరకు ఉంది అనే విషయంపై ఆరా తీశారు. సిబ్బంది పక్షపాత ధోరణి లేకుండా సర్వే చేయాలన్నారు.

క్రీడాకారులకు సౌకర్యాలు కరువు

బోథ్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోనాల గ్రామానికి చెందిన విద్యార్థులు సోమవారం పాఠశాల పీఈటీ శ్రీదేవితో కలిసి వెళ్లేందుకు పాఠశాల చేరుకున్నారు. పాఠశాల నుంచి ఆదిలాబాద్ వెళ్లే విద్యార్థులకు ఎలాంటి సౌకర్యం లేకపోవడంతో పీఈటీ వాహనాల కోసం ఎదురు చూశారు. ఎలాంటి వాహనాలు సమకూర్చకపోవడంతో ఆటలు ఆడేందుకు విద్యార్థులు సొంతవాహనాల్లో వెళ్లాల్సి వచ్చింది. జిల్లా విద్యాశాఖ అధికారులు బస్సు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి



భూమిపూజ చేస్తున్న గ్రామపటేల్

తలమడుగు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని న్యూ నందిగామ గ్రామానికి ఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా పాఠశాల భవన నిర్మాణానికి రూ. ఐదు లక్షలు మంజూరు కావడంతో వాటికి సంబంధించిన ప్రెసిడెంట్ కాపీని గ్రామ పటేల్‌కు గ్రామ స్తులకు అందజేశారు. ఈ సందర్భంగా గణే ష్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఆదివాసి గిరిజనుల విద్యార్థుల చదువుల కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. అనంతరం గ్రామ పటేల్ మాణిక్ రావు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో బాపన్న ప్రతాప్, నరసయ్య, వెంకన్న పాల్గొన్నారు.

కోలాం గిరిజనుల ఐటీడీఏ ముట్టడి

(5వ పేజీ తరువాయి...)

భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడికి చేరుకొని ఐటీడీఏ కార్యాలయానికి ఎదురుగా ఉన్న ఉట్నూర్-మంచిర్యాల ప్రధాన రహదారిపై భైఠాయించారు. ఫలితంగా రెండు గంటల పాటు ఉట్నూర్ మంచిర్యాల రోడ్డుపై బస్సులు, లారీలు నిలిచిపోవడంతో ప్రయాణికులు కొందరు కాలినడకన రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బస్టాండ్ వరకు చేరుకున్నారు. అక్కడ నుంచి ఇతర వాహనాలలో వెళ్లిపోయారు.

ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలి : రాష్ట్ర అధ్యక్షుడు

రాష్ట్రంలో కోలాం గిరిజనుల జనాభా తక్కువగా ఉండడంతో తమ సమస్యలను ఇతర తెగలు పట్టించుకోవడం లేదని ఆదిమ గిరిజన కోలాం సేవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టేకం భాస్కర్ విమర్శించారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్న బురుసా పోచయ్య తప్పుడు విధానాలు పాటిస్తూ కోలాం గిరిజనులకు అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. మన్నేవార్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించిన కోలావర్ పదం సరైనది కాదని, కోలాం గిరిజనులను కోలవార్ అంటారని అన్నారు. మహారాష్ట్రలో మన్నేవార్లు ఎస్సీలుగా చెలామణి అవుతుండగా.. తెలంగాణలో మన్నేవార్లు కోల వార్లుగా పదం జోడించు కుని ఎస్టీల రిజర్వేషన్లు అక్రమంగా పొందుతు న్నారని ఆరోపించారు. కులవార్ అనే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునః పరిశీలన కోసం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని, 2021లో గిరిజన సంక్షేమ కమిషనర్ ద్వారా మన్నేవానులను పీవీటీజీలుగా గుర్తింపు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలను వెంటనే రద్దుచేయాలని, మన్నెవార్లకు కేటాయించిన కులవార్ అను పదమును ఇప్పటి వరకు జారీ చేసిన కులధ్రువీకరణ పత్రములను వెంటనే రద్దు చేయాలని, మన్నేవార్లకు కులవారిగా గుర్తించిన నివేదికను గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్, కేసీఆర్ నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా మాట్లాడుతూ కోలాం గిరిజనుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేయడం జరుగుతుందని హామీ ఇవ్వడంతో గిరిజనులు ధర్నా విరమించారు. ఐటీడీఏ మీ కోసం ఉంది, మీరు ఏ సమయంలో వచ్చినా.. మీ పనులు చేసి పెడతామని పీవో వారితో ఈ సందరంగా స్పష్టం చేశారు. కార్యక్రమంలో మోతిరామ్, టేకం వసంతరావు, సెడ్‌మకి రామారావు, బొంత ఆశారెడ్డి, గోడం నగేష్, పుర్క బాపురావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

బొందలగడ్డలుగా అసైన్డ్ భూములు

(5వ పేజీ తరువాయి...)

తీసుకునేందుకు వెనుకాడుతున్నట్లు తెలుస్తుంది. అధికారులు దృష్టి సారిస్తే రాయల్టీ రూపంలో లక్షల రూపాయల ఆదాయం సమకూరే అవకాశం ఉన్నా.. అలాంటి మార్గాలపై అధికారులు దృష్టి సారించడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

నిరుపేద రైతులకు డబ్బులను ఎరవేస్తూ..

అమాయక నిరుపేద రైతులకు డబ్బును ఆశా చూపుతూ మైనింగ్ మాఫియా మొరం అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. భూమిలేని పేదలకు ప్రభుత్వం అందించిన అసైన్డ్ భూములను అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. అసైన్డ్ చట్టం ప్రకారం ఈ భూముల్లో ఎలాంటి వ్యాపార లావాదేవీలు జరుగకూడదు. ఈ విషయం రెవెన్యూ, మైనింగ్ అధికారులకు తెలిసినా నోరు మెదుపకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎగుడు దిగుడుగా ఉన్న రాళ్ల భూములను లెవలింగ్ చేస్తున్నామని చెబుతూ అడ్డదారిలో కొత్తగా వెలుస్తున్న వెంచర్లకు మొరం మట్టిని తరలిస్తూ అమ్మేసుకుంటున్నట్లు తెలుస్తుంది. అక్రమ తవ్వకాలతో పేద రైతుల భూములు ఎలాంటి పంటల సాగుకు యోగ్యంకాకుండా పోతున్నాయి. అమాయక రైతులకు డబ్బుతో ఎరవేస్తూ బంగారు భూములను రాళ్లురప్పలుగా మార్చి వదిలేస్తున్నారు. పట్టపగలే ఇదంతా జరుగుతున్నా.. సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై పలు రకాల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అసైన్డ్ భూముల యజమానులకు డబ్బులను ఆశ చూపడంతో అధికారులకు తప్పుడు సమాచారాన్ని ఇస్తున్నట్లు తెలుస్తుంది. ఎవరైనా అధికారులకు ఫిర్యాదు చేస్తే గ్రామాల్లో చిన్నపాటి పంచాయితీలు పెట్టి జరిమానాలు విధిస్తున్నట్లు తెలుస్తుంది. అసైన్డ్ పట్టాతో పక్కా కమర్షియల్ దందా చేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం

నేరడిగొండ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పేదప్రజలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం కోసమే ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో సోమవారం మండల కేంద్రానికి చెందిన ప్రణీత్‌కు మంజూరైన 60వేల రూపాయల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆడే వసంత్‌రావ్, బద్దంపోతారెడ్డి, కుర్మేమహేందర్, హీరాసింగ్ పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుడి మృతి

నేరడిగొండ, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చించోలి గ్రామానికి చెందిన ఆత్రం కిరణ్‌కుమార్ (26) మద్యానికి బానిసై మృతిచెందాడు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల 14న మద్యం సేవించడంతో తండ్రి కిష్టు మందలించగా తన వ్యవసాయ చేనులో పురుగుల మందు తాగగా అది గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించగా వెంటనే ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా అక్కడచికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడని ఎస్సై తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

బజార్హత్నూర్ , డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆటో బైక్ ఢీకొనడంతో ద్విచక్రవాహన చోదకుడు తీవ్ర గాయాలపాలైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. సంఘటనా స్థలంలో ఉన్న వారు తెలిపిన వివరాల మేరకు బజార్‌హత్నూర్ విద్యార్థులు ప్రతిరోజు లాగే పాఠశాల ముగిసిన తర్వాత ఆటోలో ఇచ్చోడ వైపు ప్రయాణిస్తున్న సమయంలో ఇచ్చోడా నుంచి బజార్ హత్నూర్ వైపుకు ద్విచక్ర వాహనంపై వస్తున్న వాహనచోదకుడు ఆటోను ఢీకొట్టడంతో విద్యార్థులకు గాయాలయ్యాయి, ద్విచక్రవాహన చోదకుడికి తీవ్ర గాయాలు కాగా మెరుగైన చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

అటవీశాఖ కార్యాలయానికి చేరిన బోర్‌వెల్

బోథ్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అటవీ శాఖ అధికారులు ఆదివారం సాయంత్రం బోరుబావులు తవ్వుతున్న వాహనం రిగ్గుబోర్ బండిని స్వాధీనం చేసుకున్నారు. మండలం లోని కంటేగాం, నిగిని గ్రామశివారులోని అటవీశాఖ వారు రైతులకు ఇచ్చిన భూములలో బోరు బావులు తవ్వుతున్నారన్న ఫిర్యాదు వచ్చింది. దీంతో ఆది వారం రాత్రి వాహనాన్ని అటవీశాఖ కార్యాలయంలో ఉంచారు. ఈ సమయంలో నిగిని, కంటేగా గ్రామాలకు చెందిన రైతులు వాహనాన్ని తర లించకుండా అటవీశాఖ అధికారులతో కొంత సేపు వివాదానికి దిగారు. జిల్లా ఉన్న తాధి కారుల ఆదేశం మేరకు తాము రేంజి కార్యా లయానికి తీసుకువెళ్తామని ఏదైనా సమస్య ఉంటే అక్కడ పరిష్కరించుకోవాలని గ్రామస్తు లకు అధికారులు సూచించారు. వివరణ ఇచ్చేం దుకు అధికారులు అందుబాటులో లేరు. జిల్లా ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు తగు చర్యలు తీసుకునే ఆస్కా రం ఉంది.

'బిల్లులు చెల్లించకపోతే వంట నిలిపివేస్తాం'

బోథ్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్నభోజనానికి సంబంధించిన బిల్లులతో పాటు కోడిగుడ్డు ధరను రూ.7.50 పైసల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మధ్యాహ్నభోజన కార్మికుల సంఘం సభ్యులు ఎంఈవో కె.పోశెట్టికి వినతిపత్రం అందజేశారు. తమకు రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే ఇవ్వాలని, అంతేగాక కోడిగుడ్డు ధర గిట్టుబాటు కావడం లేదని ఏడు రూపాయల 50 పైసలుగా గుడ్డుకు చెల్లించాలని పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నభోజన వంటను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

రిటైర్డ్ టీచర్ ఇంట్లో చోరీ

ఉట్నూర్, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బోయవాడలో రిటైర్డ్ గిరిజన సంక్షేమ శాఖ టీచర్ రాములు ఇంట్లో దొంగలు చొరబడి బంగారం, వెండి చోరీ చేసినట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. బాధిత కుటుంబసభ్యులు నిజామాబాద్‌లో జరిగిన వివాహవేడుకలకు శుక్రవారం వెళ్లగా దొంగలు ఇంటి తలుపులు బద్దలు కొట్టి, బీరువాలు తెరిచి బంగారం వెండి ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారన్నారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ 12 తులాల బంగారంతో పాటు కిలోనర వెండి పోయిందని తెలిపారు. ఉట్నూర్ పోలీసులు క్లూస్ టీం రప్పించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మనోహర్ వివరించారు.

అందరూ ఉత్తీర్ణులు కావాలి : ఎంఈఓ

ఉట్నూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో చదువుకుంటున్న పదోతరగతి బాలికల ఫలితాల్లో వందశాతం రావాలని మండల విద్యాధికారి ఆశన్న ఉపాధ్యాయులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ మండలకేంద్రంలోని కేజీబీవీని సందర్శించారు. వంటగది పరిశీలించి విద్యార్థులకు సరైన నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. అదే విధంగా కేజీబీవీలో చదువుకుంటున్న విద్యార్థిల చదువు ప్రమాణాలను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థుల పై ప్రత్యేక దృష్టి పెట్టి చదివించాలన్నారు.

నిర్మాణాలకు అనుమతులు ఇవ్వద్దు

ఉట్నూర్, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో భూములు అమ్మకాలు కొనుగోలు నిషేధంలో ఉన్నందున ఏజెన్సీ చట్టాలకు అనుగుణంగా నూతన భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వద్దని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామారావు అన్నారు. సోమవారం ఈ మేరకు ఉట్నూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శికి మెమోరాండం అందించారు. గిరిజనేతరులు అక్రమంగా నిర్మాణాలు కొనసాగించడం చట్టవి రుద్ధమన్నారు. ఆయన వెంట శంభు, గోవిందరావు, ఉమేష్, ఇంద్రు తదితరులున్నారు.

ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడిగా నవీన్ మహారాజ్

తలమడుగు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పార్టీ కష్టసుఖాల్లో తోడుగా ఉన్న ప్రతి కార్యకర్తని ధర్మ సమాజ పార్టీ తోడైయుండి అన్ని విధాల ఆదుకుంటుందని జిల్లా అధ్యక్షులు అగ్గిమల్ల గణేష్ మహారాజ్ అన్నారు. తలమడుగు మండలంలోని కజ్జర్ల గ్రామంలో జిల్లా అధ్యక్షుడి ఆధ్వర్యంలో తలమడుగు మండల ధర్మసమాజ్ పార్టీ అధ్యక్షుడిగా అగ్గిమల్ల నవీన్ మహారాజ్‌ను ఎన్నుకున్నారు. మండల కార్యవర్గాన్ని కూడా ఎన్నుకున్నారు. అందులో ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, అగ్గిమల్ల రాములు, ప్రధాన కార్యదర్శి కీపర్ గంగన్న, కార్యదర్శి మైలారపు వినయ్ కుమార్, ఏ.విను కుమార్, కార్యవర్గ సభ్యులు ఎస్, అశోక్, జువ్వక చందు, రవి, అశోక్, గంగన్న, కార్తీక్‌లను ఎన్నుకున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పశువుల పాక దగ్ధం

బోథ్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిప్పలదరి గ్రామానికి చెందిన బండారి కమలాకర్‌కు చెందిన పశువులపాక ఆదివారం రాత్రి షార్ట్‌సర్క్యూట్ వల్ల దగ్ధమైంది. దీంతో రైతుకు రెండు లక్షల మేరకు నష్టం సంభవించింది. నాలుగు క్వింటాల పత్తితో పాటు నాలుగు స్ప్రింక్లర్‌సెట్లు అగ్నికి ఆహుతి అయ్యాయి.

రేషన్‌బియ్యం అక్రమదందాపై పకడ్బందీ చర్యలు

ఆంధ్రజ్యోతి కథనంపై పౌర సరఫరాల శాఖ స్పందన

ఖానాపూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : 'పేదల బియ్యంపై పెద్దల కన్ను' అనే శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై జిల్లా పౌర సరఫరాల శాఖ స్పందించింది. ఈ మేరకు సోమవారం సాయంత్రం పౌర సరఫరాల శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. జిల్లాలో రేషన్‌బియ్యం అక్రమ దందాకు పాల్పడుతున్న వారిపై కఠినచర్యలు తీసుకుంటామని పేర్కొంది. ఈ ఏడాది ఆరంభం నుండి ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వారిపై 40 కేసులు నమోదు చేసినట్లు పేర్కొంది. ఈ 40 ఘటనలలో 998.13 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు పేర్కొంది. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న 17 వాహనాలను పట్టుకున్నట్లు పౌర సరఫరాల శాఖ వెల్లడించింది. ఈ ఏడాది కాలంలో పట్టుకున్న పీడీఎస్ బియ్యం విలువ రూ. 19,97,100 ఉంటుందని పౌర సరఫరాల శాఖ పేర్కొంది. జిల్లా వ్యాప్తంగా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నామని, పీడీఎస్ బియ్యాన్ని విక్రయించిన, కొనుగోలు చేసిన నేరమని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. రేషన్ దుకాణాలలో 'బియ్యం తినండి... అమ్మకండి' అని బోర్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఆంధ్రజ్యోతిలో 'పేదల బియ్యంపై పెద్దల కన్ను' అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై జిల్లా అదనపు కలెక్టర్ స్పందించి జిల్లాలోని నిర్మల్, భైంసా ఆర్డీవోలతో పాటు ఆయా మండలాల తహసీల్దార్లకు, డిప్యూటీ తహసీల్దార్లకు రేషన్ దుకాణాలలో ఆకస్మిక తనిఖీలను నిర్వ హించాలని ఆదేశాలు జారీ చేశారని పౌర సరఫరాల శాఖ వెల్లడించింది.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



కుభీర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రంజిని గ్రామంలో సోమవారం అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పంతుల కార్తీక్ స్వామి, దేవేందర్ స్వాముల ఆధ్వర్యంలో సునీల్ గురుస్వామి చేతుల మీదుగా పడిపూజ మహోత్సవం నిర్వహించారు. అయ్యప్ప స్వామికి ప్రత్యేక అభిషేకం, 18మెట్ల అలంకరణ, తదితర ప్రత్యేక పూజలు, భక్తిగాయాలను ఆలపిస్తూ శోభయామానంగా నిర్వహించారు. ఆయా గ్రామాల నుంచి స్వాములు తరలివచ్చారు. సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు.

రాష్ట్ర స్థాయి పరీక్షలో ప్రతిభ చూపిన బాసర విద్యార్థి



సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న విద్యార్థి

బాసర, డిసెంబరు, 16 : (ఆంధ్రజ్యోతి) : తెలుగు ప్రతిభ పరీక్షలో బాసర విద్యార్థి రాష్ట్ర స్థాయిలో ప్రతిభను చూపాడు. బాసర మండల కేంద్రంలోని శ్రీ నాగభూషణ విద్యాలయం పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి నేత్ర కిశోర్ ఈ నెల 13న హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో మన సంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు ప్రతిభ పరీక్ష పోటీల్లో రాష్ట్ర స్థాయిలో మొదట స్థానంలో నిలిచారు. సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ చేతుల మీదుగా నగదు బహుమతితో పాటు జ్ఞాపిక, ప్రశంసా పురస్కారం అందుకున్నాడు. దీంతో సోమవారం నేత్ర కిశోర్‌ను పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ బాబురావు జారికోటే, ఇంచార్జీ ప్రిన్సిపల్ సులోచన ఉపాధ్యాయులు అభినందించి శాలువాతో సత్కరించారు. విద్యార్థి తండ్రి గుండెల్లి కృష్ణమూర్తిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ మా పాఠశాల విద్యార్థి తెలుగు ప్రతిభ పరీక్షలో స్టేట్ ఫస్ట్ రావడం మా పాఠశాలకు గర్వకారణం అని అన్నారు.

ఏఐటీయూసీని బలోపేతం చేయండి

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఏఐటీయూసీ బీడీ కార్మిక సంఘాన్ని జిల్లాలో బలోపేతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఇన్‌చార్జి ఎస్. విలాస్ పిలుపునిచ్చారు. సోమవారం తెలంగాణ బీడీ వర్కర్స్ ఫెడరేషన్ సమావేశం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. గత కొన్నేళ్లుగా కార్మికుల కోసం ఏఐటీయూసీపోరాటం చేసిందన్నారు. సంఘం పట్ల కార్మికులు ఆకర్షితులవుతున్నారన్నారు. రాష్ట్ర కార్యదర్శి భారతల గోవర్ధన్ మాట్లాడుతూ... తెలంగాణ బీడీ వర్కర్స్ ఫెడరేషన్ గత 60 ఏళ్లుగా పోరాటం చేస్తోందన్నారు. కూలీ రేట్ల పెంపు అగ్రిమెంట్‌లో కీలక పాత్ర పోషించిందన్నారు. పెన్షన్, పీఎఫ్, ఆకు, తంబాకు తదితర సమస్యలతో పాటు 26 పని దినాల కోసం పోరాటం చేస్తున్నట్టు చెప్పారు. కే. శ్రీనివాసా చారి, భూక్యా రమేష్, యమున, రాజేశ్వర్, డి. అనంత్ రావు పాల్గొన్నారు.

ఎస్సీ గురుకులాల్లో చన్నీటి స్నానాలకు చెక్

● వేడి నీటి వ్యవస్థ కల్పించాలని సొసైటీ ఆదేశాలు ● తీరనున్న విద్యార్థుల అవస్థలు



గురుకుల విద్యార్థులు

భైంసా, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చలి తీవ్రతలో చన్నీటి స్నానాలతో ఎస్సీ గురుకులాల విద్యార్థులు ఎదుర్కొంటున్న అవస్థలు దూరం కానున్నాయి. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఎస్సీ గురుకుల సొసైటీ శీతకాలం ముగిసే వరకు తమ సంస్థలోని విద్యార్థులకు వేడి నీరు అందించేందుకు గాను నిర్ణయం తీసుకుంది. చలి తీవ్రతలో చన్నీటితో స్నానాలు అచరిస్తే విద్యార్థులకు దగ్గు, జ్వరం, జలుబు లాంటి అనారోగ్యపు సమస్యలు తలెత్తె ప్రమాదమున్న దృష్ట్యా సొసైటీ సంబంధిత నిర్ణయం తీసుకున్నట్లుగా తెలిసింది. ఇందులో భాగంగానే క్షేత్ర స్థాయిలోని అధికారులకు సంబంధిత విషయంలో గురుకుల సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. జాప్యానికి తావు లేకుండా వెంటనే గురుకులాల్లో విద్యార్థులకు వేడి నీటి వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశాల్లో పేర్కొంది,

● నిర్మల్ జిల్లాలో ఆరు గురుకులాలు

నిర్మల్ జిల్లాలో భైంసా, ముథోల్, నిర్మల్, కడెం, జామ్, లెఫ్ట్ పోచంపాడ్ కేంద్రాలలో ఎస్సీ గురుకులాలున్నాయి. ఇందులో ముథోల్ కేంద్రం బాలురకు ఉండగా మిగతా ఐదు కేంద్రాలు బాలికలకు సంబంధించినవిగా ఉన్నాయి. ఒక్కో గురుకులంలో 600 మందికి పైగా మంది విద్యార్థులు కలుపుకొని మొత్తం 4 వేల వరకు విద్యార్థులున్నారు.

● పరిస్థితులకు అనుగుణంగా వేడి నీళ్ల కోసం ఏర్పాట్లు

గురుకుల భవనాల్లో ఉన్న వసతులకు అనుగుణంగా వేడి నీళ్ల కోసం ఏర్పాట్లు చేపట్టుకోవాలని సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి ఆదేశాల్లో పేర్కొంది. ఇందులో సోలార్ హీటర్లు లేని కేంద్రాల్లో గీజర్ల ద్వారా వసతి కల్పించుకోవాలని పేర్కొన్నారు. వీలు కాని పక్షంలో నీటిని కాచి ఇచ్చేందుకు గ్యాస్ లేదా కట్టెల పొయ్యిని వినియోగించుకోవచ్చునని తెలిపింది. స్నానాల గదుల్లో నీటి సరఫరా ఉన్న చోట గీజర్లు ఏర్పాటుకు అవకాశం ఉంటే పరిశీలించాలని తెలిపింది. ఇదే క్రమంలో వేడినీళ్ల అందించేందుకు చేపట్టిన ఏర్పాటు విషయమై సొసైటీ కార్యాలయాలకు నివేదికలు పంపించాలని గురుకులాల ప్రిన్సిపాళ్లకు కార్యదర్శి ఆదేశించారు ఇందుకు అనుగుణంగా జిల్లాలోని గురుకులాల ప్రిన్సిపాళ్లు విద్యార్థులకు వేడి నీటి వ్యవస్థను కల్పించేందుకు చర్యలను చేపట్టారు.

అవకతవకలపై విజిలెన్స్‌తో విచారణ చేయాలి

● బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో వినతి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రాజ గంగన్న

ఖానాపూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో చేపట్టిన మున్సిపల్ పార్క్ నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విజిలెన్స్ విచారణ చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తాళ్లపెల్లి రాజ గంగన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు రాజ గంగన్న, పట్టణ అధ్యక్షులు గౌరీకర్ రాజులు మాటాడారు. పట్టణంలో మున్సిపల్ నిధులతో నిర్మించిన పార్క్‌లో అవినీతి జరిగినట్లు నేరుగా మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం ఆరోపించిన నేపథ్యంలో ఆ పార్క్ నిర్మాణ పనులపై విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రూ. 40 లక్షలతో చేపట్టాల్సిన పార్క్ నిర్మాణాన్ని అదనంగా మరో రూ. 50 లక్షలు పెంపొందించి రూ. 90 లక్షల నిధులతో నిర్మించినట్లు ఇటీవల నిర్వహించిన విలేకరుల సమావేశంలో చైర్మన్ చిన్నం సత్యం తెలిపారన్నారు. పార్క్‌లో కేవలం గడ్డి ఏర్పాటు చేసేందుకు రూ. 32 లక్షలను, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసేందుకు రూ. 16 లక్షలను వెచ్చించి ప్రజాధనాన్ని దోపిడీ చేశారని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం చేసిన ఆరోపణలు వాస్తవమైతే విజిలెన్స్ విచారణ ఎందుకు చేపట్టడం లేదన్నారు. చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే మున్సిపల్‌లో జరిగిన అవినీతిపై విజిలెన్స్ విచారణ కోరుతానన్న మున్సిపల్ చైర్మన్ ఇన్నాళ్లు స్పందించకపోవడం వెనుక ఆంతర్యమేంటని ప్రశ్నించారు. అవినీతికి పాల్పడిన వారిని చట్టపరంగా శిక్షించడంతో పాటు వారు కాజేసిన సొమ్మును రికవరీ చేయించాలని డిమాండ్ చేశారు. అలాగే పట్టణంలో ఇటీవల చేపట్టిన మట్టి రోడ్ల నిర్మాణం తూతూ మంత్రంగా సాగిందని ఈ పనులపై విజిలెన్స్ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో చేపట్టిన పనులన్నింటిపై విచారణ జరిపి ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్‌లో జరిగిన అవినీతిపై విచారణ చేయాలని జిల్లా కేంద్రానికి వెళ్లి కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయనున్నట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కరిపే శ్రీనివాస్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ 8వ వార్డు కౌన్సిలర్ అబ్దుల్ ఖలీల్, తిమ్మాపూర్ వీడీసీ అధ్యక్షులు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బీసీ రాజన్న, మాజీ ఎంపీపీ అబ్దుల్ మోహిద్, మాజీ వైస్ ఎంపీపీ గుగ్లావత్‌వాల్ సింగ్, డీఆర్‌బీఎస్ జిల్లా మాజీ డైరెక్టర్ కొక్కుల ప్రదీప్, ఖానాపూర్ మాజీ ఉప సర్పంచ్ కారింగుల సుమన్, ఎర్వచింతల్ మాజీ సర్పంచ్ కే. గోపాల్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శనివారపు శ్రావణ్ కుమార్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు పుప్పాల గజేందర్, తోట సుమిత్, సిరిగారపు లింగన్న, నసీర్, ఇర్ఫాన్, వహాబ్, మోహిన్, షోయబ్, సాడిగె ప్రసాద్, ప్రశాంత్ రెడ్డి, నంద రాకేష్, సల్ల చంద్రహాస్, దివాకర్, గాజుల అజయ్, బలగం రమేష్, హర్షద్‌తో పాటు పలువురు మండల నాయకులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరాలయంలో
ఆరుద్ర నక్షత్ర పూజలు

నర్సాపూర్(జి), డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): శివుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం మార్గశిర మాసం, శుక్లపక్షం సోమవారం కావడంతో శివాలయాల్లో భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. శివుని జన్మనక్షత్రం కావడంతో ఉదయం సూర్యోదయం నుంచి సిద్దేశ్వర ఆలయంలో శివునికి అభిషేకాలు, అర్చనలు, పంచామృతాభిషేకాలు, తులసి దళాలు, బిల్వార్చన, పుష్పార్చన వంటి పూజలు నిర్వహించినట్లు వేద పండితులు కైలాస్ తెలిపారు. నర్సాపూర్ జి మండలం టెంబుర్ని గ్రామ శ్రీచక్రలింగేశ్వర ఆలయంలో భక్తులు ఉదయం నుంచి శివునికి అభిషేకాలు నిర్వహించారు.

గిరిజనుల సమస్యలు
సత్వరమే పరిష్కరించాలి

ఉట్నూర్, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ చాంబర్‌లో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. గాదిగూడ మండలం శివన్నార గ్రామానికి చెందిన రాజు తనకి ఆర్థిక సహాయం అందించాలని, ఉట్నూర్ మండలం పిట్లగూడ గ్రామానికి చెందిన పంచపూల తనకి అంగన్‌వాడీ సెంటర్‌లో ఉద్యోగం కల్పించాలని, మంచిర్యాల గ్రామానికి చెందిన లింగవ్వ తనకి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కావాలని కోరారు. పింఛన్లు, రెండు పడక గదుల ఇండ్లు స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూశాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ వసంతరావు, ఏపీఓ పీవీటీజీ మేస్రం మనోహర్, సీడీపీఓ ఉమాదేవి, డీపీఓ ప్రవీణ్, మేనేజర్ లింగు తదితర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ వాచ్


మార్కెట్‌లో అమ్మకానికి ఉన్న కోడిగుడ్లు

కొండెక్కిన గుడ్డు ధర!

● రూ.7కు చేరుకున్న ఒక్కో గుడ్డు ధర

భైంసా, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ధరాఘాతాల జాబితాలో కోడి గుడ్లు కూడా చేరుకున్నాయి. కోడిగుడ్డు ధర కొండెక్కింది. ఓవైపు చికెన్ ధరలు పడిపోతుండగా.. గుడ్డు ధర మాత్రం పెరుగుతుండటం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ప్రస్తుతం మార్కెట్లో కోడిగుడ్డు ధర కొండెక్కింది. ఎన్నడూ లేనివిధంగా మార్కెట్లో గుడ్డుధర రూ.7కు చేరుకుంది. శీతాకాలంలో గుడ్డు ధర పెరుగడం సాధారణమే అయినప్పటికీ ఇంతగా పెరుగడం అరుదని, ఇటు కొనుగోలుదారులు అటు వ్యాపారులు అంటున్నారు. ఈనెలలో క్రిస్మస్ పర్వదినంతోపాటు ఆంగ్ల సంవత్సరాది వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఈక్రమంలో కేకుల తయారీ అధికంగా జరుగుతూ ఉంటుంది. కేకుల తయారీలో కోడిగుడ్డు వినియోగం ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో కోడిగుడ్ల వినియోగం పెరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు ఆహారంలో గుడ్డు తప్పనిసరి చేశారు. దీంతో గుడ్డుకు డిమాండ్ పెరుగుతూ పోతోంది.

● నాలుగు నెలల నుంచి ..

మార్కెట్లో కోడి గుడ్డు ధరలు 4నెలలుగా పెరుగుతూ పోతున్నాయి. ఆగస్టు మాసంలో రూ.5లకు లభ్యమైన కోడి గుడ్డు ధర ప్రస్తుతం రూ.7కు చేరుకుంది. సెప్టెంబరు మాసంలో రూ.5.50కు, అక్టోబరులో రూ.6కు ధరలు పెరిగాయి. ఇక నవంబర్‌లో రూ 6.5కు లభ్యమైన కోడి గుడ్డు ధర డిసెంబరు నాటికి రూ.7కు చేరుకున్నాయి.

నేడు అయ్యప్ప క్షేత్రంలో ఆరట్టు

● ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ నిర్వాహక కమిటీ



ముస్తాబైన అయ్యప్ప ఆలయం

భైంసా, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప క్షేత్రంలో మంగళవారం నిర్వహించనున్న ఆరట్టు ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించేందుకు గాను ఆలయ నిర్వాహక కమిటీ ఘనంగా ఏర్పాట్లు చేపట్టింది. ఇందులో భాగంగానేఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఆరట్టు ఉత్సవంలో భాగంగా అయ్యప్పస్వామి ఉత్సవ మూర్తికి పురవీధుల మీదుగా శోభాయాత్ర చేపట్టేందుకు ప్రత్యేక వాహనాన్ని సిద్ధంచేశారు. అయ్యప్ప క్షేత్రం నుంచి ప్రారంభమయ్యే శోభాయాత్ర గడ్డెన్న వాగు ప్రాజెక్టు వరకు కొనసాగనుంది. అక్కడ అయ్యప్ప స్వామి ఉత్సవ మూర్తికి జలాభిషేకం నిర్వహించి తిరిగి అయ్యప్ప క్షేత్రానికి తీసుకరానున్నారు. అనంతరం అయ్యప్ప క్షేత్రంలో భారీ అన్నదాన కార్యక్రమం జరుగనుంది. రాత్రివేళలో అయ్యప్ప క్షేత్రంలో మండల పూజ నిర్వహించనున్నారు. అయ్యప్పక్షేత్ర ప్రధాన అర్చకులు మంత్రి సాయినాథ్ స్వామి ఆధ్వర్యంలో ఉత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రణాళికబద్ధమైన చర్యలు చేపట్టింది. డివిజన్ పరిధిలోని అయ్యప్ప స్వామి దీక్షదారులు, భక్తులు అరట్టు ఉత్సవములో అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి అనుగ్రహానికి పాత్రులు కావాలని అలయ కమిటీ విజ్ఞప్తి చేసింది.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

తాంసి, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): కంచలేని ట్రాన్స్‌పార్మర్ పాఠశాల ముందు ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అన్నిశాఖల అధికారులు కొలువుండే మండలకేంద్రంలోనే ఇలాంటి దృశ్యాలు కనిపిస్తే మారుమూల ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటాయో అర్థం చేసుకోవచ్చని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాల ఆవరణముందే ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. గతంలో మూగజీవాలు ఇక్కడ విద్యుత్‌షాక్ తలిగి మృతి చెందిన ఘటనలు సైతం ఉన్నా చర్యలు చేపట్టడం లేదు. దీని గురించి గ్రామస్థులు, విద్యా ర్థుల తల్లిదండ్రులు ఉన్నతాధికారులకు వివరించినా పట్టించుకోవడం లేదని అంటున్నారు. ప్రమాదం సంభవించక ముందే తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


పాఠశాల ముందు కంచెలేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్


పచ్చని దుప్పటిలా చెట్లు..


అడవిలో సంచరిస్తున్న జింకలు

ఫొటో న్యూస్



అడవి అందాలు అదరహో..

● కనువిందు చేస్తున్న ప్రకృతి సోయగాలు ● కొండల మధ్య మయూరి నాట్యం
● జింకలు, పెద్దపులుల సంచారం ● సహజ ప్రకృతి వనాలు ఆదిలాబాద్ సొంతం

తలమడుగు, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): అందమైన అడవుల ఆదిలాబాద్ జిల్లా ప్రకృతి అందాలు కమనీయం ఆదిలాబాద్ అంటే గుర్తుకు వచ్చేవి దట్టమైన అడవులు, ప్రకృతి సహజ సిద్ధమైన ప్రకృతి వనాలు. మయూరి నాట్యం, జింకల సంచారం కోయిల కూతలు, ఆకాశాన్ని భూమిని కలిపిన పొగమంచు అందాలు తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం కోసాయిపల్లి(కే), పల్సీ(బీ), రత్నాపూర్, డోర్లి. కొండపై ఉండేగ్రామాల సమీపంలోని దట్టమైన అడవుల్లో ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చి దిద్దితే తెలంగాణ జిల్లాలోని ఆదిలాబాద్ అందాలు లంబ సింగీ, ఊటీ, కోడై కెనాల్ లాంటి దృశ్యాలను ఆదిలాబాద్‌లోనే చూడొచ్చు. ఈప్రకృతి దృశ్యాలను వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ తన కెమెరాలో బంధించారు.

రబీ సాగుకు రైతుల సన్నద్ధం

● పత్తి సాగుకు ఆసక్తి చూపని రైతులు


విత్తనాలు నాటేందుకు సిద్దంగా చేసిన పంట పొలం


జొన్న సాగుకోసం పత్తిని తొలగిస్తున్న దృశ్యం

తాంసి, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ఈ సంవత్సరం రైతాంగానికి తీవ్ర నష్టాలతోపాటు కష్టాలను చవిచూయించింది. ఇక రబీ తమకు ప్రత్యామ్నాయమని రైతులు ఆ పంటల సాగు కోసం ముందడుగు వేస్తున్నారు. ఎన్నడూ లేనివిధంగా ఈయేడు 3నెలల ముందుగానే పత్తి పంట పూర్తి అయింది. దిగుబడులు తగ్గి పూర్తిగా నష్టాలను చవిచూసిన అన్నదాతలు ప్రస్తుతం రబీ సాగు కోసం సమాయత్తమవుతున్నారు. తాంసి మండలంలో ఎన్నడూలేని విధంగా ఈయేడు రబీ సాగుకు రైతులు ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. ఈ పాటికి కొంతమంది రైతులు విత్తనాలు నాటగా మరికొంత మంది రైతులు పత్తిని తీసి విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. గతంతో పోలిస్తే ఈ యేడు రబీసాగు గణనీయంగా పెరగ నుందని చెప్పొచ్చు. రబీసాగులో శనగ, మొక్కజొన్న, జొన్న, పెసర, మినుము, నువ్వుల పంటలను సాగుచేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈపాటికి కొంతమంది రైతులు శనగ విత్తనాలు నాటి సుమారు 40 రోజులు కావస్తోంది.

● జొన్న సాగుకు రైతాంగం ఆసక్తి

గతంతో పోలిస్తే ఈయేడాది జొన్న సాగు గణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. తాంసి మండలమే కాదు జిల్లావ్యాప్తంగా ఈ పంటను సాగుచేసేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. ఎందుకంటే ఈ జొన్న పంటకు మార్కెట్లో గిట్టుబాటు ధర ఉండడమే కాకుండా ప్రతీ మండలానికి మార్కెట్ సదుపాయం కూడా ఉంది. దీంతో జొన్నపై ఎక్కువ మొగ్గు చూపుతున్నారని చెప్పవచ్చు. ఈ పాటికి కొంతమంది జొన్న విత్తనాలు వేయగా చాలామంది రైతులు పత్తిని తీసి జొన్నలు వేసేందుకు ముందుకు వస్తున్నారు. ఖరీఫ్‌లో పత్తి వేసి దిగుబడులు తగ్గి నష్టపోయిన రైతులు అంతా జొన్నసాగుకే ప్రాధాన్యం ఇస్తున్నారు.


అటవీశాఖ కార్యాలయానికి వచ్చిన ఎనిమిల్ ట్రాకింగ్ కెమెరాలు

ఎనిమల్ ట్రాకింగ్ కెమెరాలు వచ్చాయోచ్!


బోథ్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బోథ్ రేంజ్ పరిధిలో జంతువుల సంచారాన్ని పసిగట్టేందుకు గాను అటవీశాఖ వారికి ఉన్నతాధికారులు ఎనిమల్ ట్రాకింగ్ సీసీ కెమెరాలను పంపించారు. దీంతో అటవీశాఖ అధికారులు అడవులలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. కెమెరాల ఏర్పాటుతో ఎనిమల్ ట్రాకింగ్‌తో పాటు అక్రమ కలప రవాణా అడవులలో జరుగుతున్న ప్రతీ విషయం సీసీ కెమెరాలకు చిక్కనుంది.

అధికారులూ.. రహదారికి మరమ్మతులు చేయరూ!

కుభీర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తా నుంచి ప్రభుత్వ పశువైద్యశాల వరకు సుమారు కిలోమీటరు పొడవున రహదారి పూర్తిగా ధ్వంసమైంది. దీనికి తోడు గత నెల రోజులుగా బెల్గాం గ్రామానికి రహదారి నిర్మాణ పనుల కోసం భారీ వాహనాలు ఈ రహదారి మీదుగా రాకపోకలు చేయడంతో పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ప్రతీరోజు ప్రమాదాలు జరుగుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు ఈ రహదారిపై వెళ్లాలంటే జంకుతున్నారు. ఇంత అధ్వానంగా మారినా పట్టించుకునేవారు కరువైయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకొని మరమ్మత్తులు చేపట్టాలని కోరుతున్నారు.


జర దేఖో!!

కుభీర్ మండల కేంద్రం వద్ద ధ్వంసమైన రహదారి



పొగమంచుతో వాహన హెడ్‌లైట్ వేసుకుని వస్తున్న వాహనదారులు


ఎస్టీ బాలుర వసతి గృహంలో చన్నీటిస్నానాలు చేస్తున్న విద్యార్థులు

వణికిస్తున్న చలిపులి!

● ఆదిలాబాద్‌లో సగటు కనిష్ఠ ఉష్ణోగ్రత 5.2 డిగ్రీలు

ఆదిలాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఆదిలాబాద్ జిల్లాలో నమోదవుతున్నాయి. గతవారం రోజులుగా వరుసగా సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు కనిపిస్తున్నాయి. సోమవారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 27.8 డిగ్రీలు కాగా, కనిష్ఠంగా 5.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే బీంపూర్ మండలం అర్లి(టి)లో 6.0 డిగ్రీలు, బేలలో 6.3, బోథ్‌లో 6.4, మావలలో 6.6 జైనథ్‌లో 6.7, ఉట్నూర్‌లో 7.2, సిరికొండలో 8.2, ఇంద్రవెల్లిలో 9.5 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లావ్యాప్తంగా 13 డిగ్రీల లోపే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బీంపూర్ మండలం అర్లి(టి), బేల, జైనథ్, మావల మండలాల్లో పలుప్రదేశాల్లో రికార్డుస్థాయిలో అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో రాత్రిపగలు అనే తేడాలేకుండా ప్రజలు చలిమంటలు వేసుకుంటు వెచ్చదనం పొందుతున్నారు. ముఖ్యంగా ఉత్తరాది నుంచి వీస్తున్న శీతలగాలుల ప్రభావంతో చలితీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. అలాగే జిల్లాలో నల్ల రేగడి నేలలు అధికంగా ఉండడం చలితీవ్రతకు మరో కారణమని చెబుతున్నారు. అడవులు విస్తరించి ఉండడం వాగులు,కొండ ప్రాంతాలలో ఎక్కువగా చలి తీవ్రత కనిపిస్తోంది. ముఖ్యంగా మారుమూల గ్రామాలను దట్టమైన పొగమంచు కప్పేయడంతో తీవ్రమైన చలితో జనం వణికి పోతున్నారు. మరో వారం రోజులపాటు జిల్లాపై ఎక్కువగానే చలి ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు.

పగలు, రాత్రి చలి మంటలే..


బోథ్‌లో చలి మంటల వద్ద ప్రజలు

బోథ్: మండలంలో చలి తీవ్రమైంది. సోమవారం మండలంలోని పొచ్చెర గ్రామంలో 6.5 డిగ్రీలుగా నమోదైంది. దీంతో చలిపులి నుంచి కాపాడుకునేందుకు ప్రజలు చలిమంటల వద్దకు చేరుకుంటున్నారు. రాత్రి 7గంటల కే ప్రజలు తమ ఇళ్లకు చేరుకుంటున్నారు. నాలుగు గంటల నుంచి చల్లని ఈదురుగాలి వీస్తుండటంతో చలినుంచి కాపాడుకునేందుకు స్వెట్టర్లు తప్పనిసరిగా వేసుకుంటున్నారు. తెల్లవారుజాము 7గంటల వరకు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. పలు హాస్టల్లో చదివి విద్యార్థులు సన్నిటి స్నానాలు చేయాల్సి వస్తోంది. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. హాస్టల్లో వేడి నీటి కోసం సోలార్ బాయిలర్లు ఏర్పాటుచేసినా అవి పని చేయడం లేదు. అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.


ఆదిలాబాద్ పట్టణాన్ని కమ్మేసిన పొగమంచు

అట్టహాసంగా జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడాపోటీలు



ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు



మాట్లాడుతున్న కలెక్టర్


సాఫ్ట్ బాల్ ఆడుతున్న కలెక్టర్

నిర్మల్ అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు ప్రతిభను మెరుగుపరుచుకోవడానికి ఉపయోగపడతాయని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం సీఎంకప్- 2024 జిల్లాస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ సీఎం క్రీడలు యువతకు క్రీడాప్రాముఖ్యతను చాటి చెప్పే గొప్పవేదికని అన్నారు. యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు వారి ప్రతిభను మెరుగుపరచడానికి ఒక అద్భుత మైన అవకాశాన్ని కల్పిస్తాయన్నారు. సీఎంకప్ క్రీడాపోటీల లో గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయిలో పాల్గొనేలా యువతను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. మండల స్థాయిలో విజయ వంతంగా పోటీలను నిర్వహించినట్లు చెప్పారు. నేటి నుంచి నాలుగు రోజులు జిల్లాస్థాయిలో క్రీడాపోటీలను నిర్వహిస్తామన్నారు. తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో జరిగే క్రీడలలో పాల్గొంటారని తెలిపారు. క్రీడా పోటీల్లో పాల్గొంటున్న ప్రతీ ఒక్కరికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. గెలుపు, ఓటములు సహజమని, కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసమే నిజమైన విజేతలుగా నిలబెడతాయన్నారు. యువత చదువుతో పాటు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడా పతకాలు సాధించాలన్నారు. క్రీడానైపుణ్యాన్ని పిల్లల్లో అభివృద్ధి చేయడానికి, నైపుణ్యం కలిగిన కోచ్‌లను నియమించడానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతానని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం క్రీడల కోసం నిర్మల్ జిల్లాలో స్పోర్ట్స్ పాఠశాల నిర్మించే విధంగా తమ వంతు ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం విద్యా, ఉద్యోగాల్లో రెండు శాతం రిజర్వేషన్ కల్పించడం జరుగుతుందని, క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు సాధించాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. జిల్లా స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో సోమవారం కబడ్డీ, ఖోఖో, బేస్ బాల్, సాఫ్ట్ బాల్, ఆర్చరీ, జూడో క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో జిల్లావ్యాప్తంగా 18 మండలాల నుండి సుమారు 1700 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీ డల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖమర్ అహ్మద్, ఎఫ్ఏసీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, వ్యవసాయ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, ఒలంపిక్ అసోసియేషన్ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ రవీందర్ గౌడ్, పేట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూక్యా రమేష్, భోజన్న, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి సునీల్, వివిధ క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.





విస్తరిస్తున్న ఫైలేరియా

- పూర్తయిన నైట్ బ్లడ్ సర్వే
- జిల్లాలో 18 గ్రామాల గుర్తింపు
- ఇంటింటికీ వెళ్లి శాంపిల్‌ల సేకరణ
- ఒకటి రెండు రోజుల్లో బ్లడ్ శాంపిల్స్ సర్వే రిపోర్ట్‌లు



రాత్రి వేళలో రక్త నమునాలు సేకరిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది (ఫైల్)


నిర్మల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఫైలేరియా వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ గుర్తించింది. ఇప్పటి వరకు జిల్లాలో 1,474 ఫైలేరియా కేసులు ఉన్నట్లు గుర్తించిన వైద్య, ఆరోగ్యశాఖ ఈ కేసులు మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నట్లు నిర్ధారించింది. దీంతో ఫైలేరియా మరింతగా విస్తరించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖ యాక్షన్‌ప్లాన్ రూపొందించింది. దీనికి అనుగుణంగా ఫైలేరియా తీవ్రత ఉన్నట్లు గుర్తించిన ప్రాంతాలలో ఆ శాఖ మైక్రో ఫైలేరియా నైట్‌బ్లడ్ సర్వే పేరిట స్థానికులందరి నుంచి బ్లడ్‌శాంపిళ్లను సేకరించేందుకు నిర్ణయించింది. గురువారం రాత్రి పది గంటల నుంచి గుర్తించిన ప్రాంతాలలో వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికీ తిరిగి స్థానికుల బ్లడ్ శాంపిళ్లను సేకరించింది. ఈ శాంపిళ్లను శుక్రవారం ఆయా పీహెచ్‌సీల ల్యాబ్‌లలో పరీక్షించారు.



వారం రోజుల్లో ఏ గ్రామంలో ఎంత మంది రక్తంలో ఫైలేరియా కణాలున్నాయనే అంశాన్ని వెలుగులోకి తేనున్నారు. దీని ఆధారంగా వారందరికీ ముందస్తు చికిత్సలు అందించి వారి శరీరంలో ఫైలేరియా క్రిములు విస్తరించకుండా అడ్డుకట్ట వేయాలని భావిస్తున్నారు. ఈ ప్రక్రియను వైద్యఆరోగ్యశాఖ పరిధిలోని వెక్టార్ బార్న్ డిసీజెస్ విభాగం పర్యవేక్షించనుంది. ఇప్పటికే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈ మైక్రో ఫైలేరియా నైట్ బ్లడ్ సర్వే కొనసాగుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 35 వేల నుండి 40 వేల మంది వరకు ఫైలేరియా బాధితులున్నట్లు అధికారులు చెబుతున్నారు.

18 గ్రామాల్లో సర్వే

జిల్లాలోని గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న 18 గ్రామాలలో ఫైలేరియా ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీనికి అనుగుణంగా జిల్లా కేంద్రంలోని రాంనగర్, మంజులాపూర్‌లతో పాటు కనకాపూర్, దిమ్మదుర్తి, కొరిటికల్, చింతలపేట, కుంటాల, దిలావర్‌పూర్, గడ్‌చందా, తిమ్మాపూర్, లింగాపూర్, భూత్కూర్, దేగాం, ఎడ్‌బిడ్, భైంసా పట్టణంలోని సిద్ధార్థనగర్, కుభీర్, చోండి, బోసి గ్రామాల్లో ఇటీవల రాత్రివేళ రక్తశాంపిళ్లను సేకరించారు. కాగా 20 ఏళ్ల దాటిన వారిలో మాత్రమే ఫైలేరియా లక్షణాలు వెల్లడి కానున్న కారణంగా ఆ వయస్సు పైబడిన వారి రక్తశాంపిళ్లను మాత్రమే సేకరించారు. ఓ వ్యక్తి శరీరంలో ఫైలేరియా క్రిములున్నట్లయితే అవి రాత్రి 10 గంటల తర్వాతనే రక్తం ద్వారా వెళ్లడవుతాయని వైద్యాధికారులు పేర్కొంటున్నారు.



ఫైలేరియా టెస్ట్ రిపోర్టుల్లో ఫైలేరియా క్రిమి (ఫైల్)

ఫైలేరియా కేసుల నిర్ధారణకు నైట్ బ్లడ్ సర్వే

జిల్లాలో ఫైలేరియా కేసులు విస్తరిస్తున్నాయి. దీని కారణంగానే రాబోయే రోజుల్లో ఫైలేరియా వ్యాధి విస్తరించకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగానే 18 గ్రామాలను ఎఫెక్టెడ్‌గా గుర్తించాం. ఈ గ్రామాల్లో మైక్రో ఫైలేరియా నైట్ బ్లడ్ సర్వే పేరిట ఇంటింటి సర్వే చేపట్టాం. రక్త పరీక్షల అనంతరం ఫైలేరియా క్రిములున్న వారిని గుర్తించి వారందరికీ ట్రీట్మెంట్ అందిస్తాం. వీరికి డీఈసీ మాత్రలను సంవత్సరం పాటు అందించి వారిలో ఫైలేరియా క్రిములను నివారించేందుకు చర్యలు చేపడతాం. మలేరియా వ్యాధిపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించేందుకు కూడా చర్యలు తీసుకుంటాం.

డాక్టర్ రవీందర్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్,
మలేరియా అండ్ ఫైలేరియా విభాగం,
డీఎం అండ్ హెచ్‌వో ఆఫీస్, నిర్మల్

హరిహర క్షేత్రంలో ఘనంగా

అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



పూజలో పాల్గొన్న మహిళలు

నిర్మల్ అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణ కేంద్రంలోని హరిహర క్షేత్రం మల్లన్న గుట్ట ఆలయంలో కొలువుదీరిన దేవి లలితా పరమేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ మురళీధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 108 కలశాలతో అమ్మవారి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, నూతన వస్త్ర అలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణమంతా అమ్మ నామస్మరణతో మార్మోగింది. ఇదిలా ఉండగా ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. నిత్యాన్నదానంలో భాగంగా అయ్యప్ప స్వాములకు, భక్తులకు మహా అన్నదాన ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం అన్నదాతలను సన్మానించారు. ఎవరైనా అన్నదానం చేయాలనుకుంటే ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ గురుస్వామి నవయుగ మూర్తి, ఆలయ కోశాధికారి సామల వేణుగోపాల్‌రెడ్డి, ఆలయ పూజారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి హోమం



గణపతి హోమం నిర్వహిస్తున్న పండితులు

బాసర, డిసెంబరు, 16 (ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతీ అమ్మవారి ఆలయ సమీపాన గల గణేష్ మందిరంలో సోమవారం గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. గురుస్వామి జ్ఞాని పటేల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పండితులు మంత్రోచ్ఛరణాల మధ్య హోమాన్ని నిర్వహించారు. స్థానిక అయ్యప్ప స్వాములతో పాటు భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ వినాయకుడు ఆలయాలు అరుదుగా ఉంటాయని, అమ్మవారి ఆలయానికి అతి సమీపాన దేవస్థానం ఆధీనంలో గల ఈ ఆలయాన్ని దేవస్థానం అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రెండవ రోజు గ్రూప్ 2 పరీక్షకు 4045 మంది హాజరు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సోమవారం నిర్వహించిన గ్రూప్ 2 పరీక్షకు 4045 మంది అభ్యర్థులు 3వ పేపర్‌కు హాజరయ్యారు. 4వ పేపర్‌కు 4044 మంది హాజరయ్యారు. మొత్తం 8080 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

ఘనంగా ప్రారంభమైన ధనుర్మాసోత్సవాలు



ప్రత్యేకపూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఇందుర్తి ఆచార్య కళ్యాణ్

భైంసా, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పద్మావతీ కాలనీ పరిధిలో గల శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ధనుర్మాసోత్సవాలు భక్తుల కోలాహలం మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా వేకువజామువేళలో ఉత్సవ మూర్తులను శోభయమానంగా అలంకరించి పల్లకీసేవ చేపట్టారు. ప్రత్యేకపూజ కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా భక్తులు మంగళ హారతులతో గేయాలు ఆలపిస్తూ పల్లకి సేవల పాల్గొన్నారు. ధనుర్మాసోత్సవాలలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థాన ఆచార్య పురుషులైన శ్రీమాన్ వీరవల్లి శ్రీనివాస రాఘవాచార్యుల శిష్యులైన నిర్మల్‌కు చెందిన ఇందుర్తి ఆచార్య కళ్యాణ్ చేపట్టిన తిరుప్పావై ప్రవచనాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచాయి.

ఇందిరా మహిళా శక్తి

క్యాంటీన్ ప్రారంభించిన డీఆర్‌డీవో

సోన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను డీఆర్‌డీవో విజయలక్ష్మి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం వెంకట సాయిప్రసాద్, ఏపీఎం, ఏపీవోలు, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ కృష్ణ, సీసీలు, వీవోఏలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న డీఆర్‌డీవో

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించేలా పటిష్ట చర్యలు చేపట్టాలి

కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించేలా పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణిలో భాగంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి ఆమె అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌తో కలిసి అర్జీలను స్వీకరించారు. విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, రెవెన్యూ, భూ సంబంధిత తదితర సమస్యలపై ప్రజలు అర్జీలను సమర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలను వారంలోగా పరిష్కరించాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలను తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే సంక్షేమ వసతిగృహాలను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ మెరుగైన విద్య, భోజన వసతులు కల్పించాలని, గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ప్రజావాణిలో ఆర్డీవో రత్నకల్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రభుత్వ కార్యాలయాల్లో కానరాని స్వచ్ఛత

● మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్వహణ లోపం ● ఉద్యోగులు, ప్రజల ఇబ్బందులు ● పరిసర ప్రాంతాల్లోనే బహిరంగ విసర్జన



భైంసా మండల విద్యావనరుల కేంద్రం వద్ద శిథిలావస్థ దశకు చేరుకున్న మరుగుదొడ్ల గదులు



భైంసా ఎంపీడీవో కార్యాలయంలో తాళం వేసి ఉన్న మరుగుదొడ్డు , మూత్రశాలల గది

భైంసా,డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛభారత్‌పై విస్తృతి ప్రచారం చేసే అధికారులు నిత్యం ఉండే కార్యాలయాల్లో స్వచ్ఛత లోపిస్తుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లు లేక కొన్ని చోట్ల, ఉన్నా ఉపయోగంలో లేక మరికొన్ని చోట్ల ఆయా కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం ప్రజలు వచ్చే కార్యాలయాల వద్ద కూడా కనీసం మూత్రశాలలు అందుబాటులో లేక బహిరంగ మూత్రవిసర్జన చేస్తున్న వైనం కనిపిస్తుంది. గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి విస్తృత ప్రచారం నిర్వహించే అధికారుల తీరు చూస్తుంటే ఇంట్లో ఈగలమోత బయటపల్లకీమోత అనే సామెతను నిజం చేస్తున్నట్లు కపిస్తుంది. డివిజన్ కేంద్రమైన భైంసాలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పరిస్థితిని పరిశీలించి అందిస్తున్న కథనం... డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలిస్తే నిత్యం ప్రజలు వచ్చి వేళ్లే ఆర్డీవో కార్యాలయాలం వద్ద సరియైన రీతిలో మూత్రశాలలు లేవు. దీంతో అక్కడకు వచ్చే ప్రజలు చుట్టుపక్కల ఉన్న చెట్లు, గోడల వైపు వెళ్లి పనికానిస్తున్నారు. తహ సీల్దార్ కార్యాలయంలో కింది స్థాయి ఉద్యోగులు, సిబ్బంది మరుగుదొడ్లు సక్రమంగా లేకపోవడంతో సమీపంలో ఉన్న మున్సిపాలిటీ మరుగుదొడ్లను పైసలు ఇచ్చి వాడుకుంటున్నామని కొందరు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో,ఎంపీపీ చాంబర్‌లలో మాత్రమే మరుగుదొడ్డి, మూత్రశాలలు వినియోగంలో ఉన్నాయి. ఇక సిబ్బంది, వచ్చి పోయే వారి కోసం ఏర్పాటు చేసిన మూత్రశాలలు,మరుగుదొడ్డి గదికి ఎప్పుడు తాళం వేసి ఉంటోంది. మున్సిపాలిటిలో సైతం ఉద్యోగు ల కోసం వసతులు ఉన్నప్పటికి వివిధ పనుల కోసం వచ్చి పోయే వారి కోసం ఎలాంటి ఏర్పాట్లు లేకపోవడంతో సమస్యలు ఏర్పడుతున్నాయి. వ్యవసాయశాఖ, విద్యుత్ సబ్‌స్టేషన్, ట్రెజరీ, రిజిస్ట్రేషన్ తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మాణాలు లేకపోవడంతో ఇబ్బందులు నెలకొంటున్నాయి. మండల విద్యా వనరులు కేంద్రం వద్ద నిర్మించిన మరుగుదొడ్లు, మూత్రశాలలు నీటి సదుపాయం లేక నిరుపయోగంగా మారి శిథిలావస్థ దశకు చేరుకున్నాయి. సంబంధిత కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం నిత్యం వచ్చే ప్రజలతో పాటు సిబ్బంది కూడా సమీపంలో ఉన్న చెట్ల వద్దే అన్ని కార్యక్రమాలు ముగిస్తున్నారు. ఉన్నతాధికార యంత్రాంగం పట్టణ పరిధిలోని అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించి స్వచ్ఛభారత్ కార్యాక్రమాన్ని విజయవంతం చేయాల్సిన అవశ్యకతం ఎంతైనా ఉంది.

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి

పెంబి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు ప్రయోజనార్థం నిర్వహిస్తున్న ఉచిత భూసార పరీక్ష సేవలను సద్వినియోగం చేసుకోవాలని పెంబి మండల వ్యవసాయ అధికారి నవీన్ అన్నారు. సోమవారం మండలంలోని కృష్ణా నాయక్ తండా, ఇటిక్యాల్, లోతర్య తండా, తాటి గూడ గ్రామాల్లో భూసార పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు క్షేత్రస్థాయిలో డెమో చేసి చూపించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ఆస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా పెంబి మండలాన్ని ఎంపిక చేసుకున్నందున మండలం పరిధిలోని సుమారు 3,400 మంది రైతులకు సంబంధించి ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహించనున్నామని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ భూమిలో ఉన్న పోషక విలువలతో పాటు, ఉదజని సూచిక, కర్బన శాతం, సమస్యలను తెలుసుకోవడానికి ఈ భూసార పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయని రైతులకు సూచించారు. పరీక్షల అనంతరం రైతులకు భూసార పరీక్ష కార్డులను అందజేస్తామని తెలిపారు. కావునా ఈ అవకాశాన్ని రైతులు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్‌కుమార్, లక్ష్మణ్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

బ్యాంక్ దొంగతనానికి

యత్నించిన కేసులో ఇద్దరికి జైలు

ఖానాపూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బ్యాంక్ దొంగతనానికి యత్నించిన కేసులో ఇద్దరికీ ఖానాపూర్ జేఎఫ్‌సీఎం కోర్టు జైలు శిక్ష విధించినట్లు కోర్టు లైజనింగ్ అధికారి రాథోడ్ మణిరామ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా కడెం మండలం మాసాయిపేట గ్రామానికి చెందిన దర్శనాల ఊషన్న, పెత్తరపు గ్రామానికి చెందిన పులి ప్రేమ్‌సాగర్ అనే ఇద్దరు వ్యక్తులు 2017 ఆగస్టు 7వ తేదీన ఖానాపూర్ పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంక్ తిమ్మాపూర్ బ్రాంచ్‌లో దొంగతనం చేసేందుకు మంకీ క్యాంప్ ధరించి సుత్తితో బ్యాంక్ షట్టర్ తాళం పగులగొట్టేందుకు యత్నించారన్నారు. ఈ మేరకు అప్పటి ఖానాపూర్ ఎస్సై కే.వినయ్ కేసు నమోదు చేయగా న్యాయస్థానం ఈ కేసును విచారించి ఇద్దరు నిందితులకు ఆరు రోజులు జైలు శిక్ష, రూ.1000 చొప్పున జరిమానా విధించినట్లు ఆయన పేర్కొన్నారు. సకాలంలో ఛార్జ్ షీట్ వేసిన అప్పటి ఎస్సై కే. వినయ్‌తో పాటు సాక్షులను సకాలంలో కోర్టులో ప్రవేశపెట్టిన ప్రస్తుత ఎస్సై రాహుల్ గైక్వాడ్, కోర్టు లైజనింగ్ అధికారి రాథోడ్ మణిరామ్‌లను జిల్లా ఎస్పీ జానకి షర్మిల అభినందించినట్లు పేర్కొన్నారు.

బాలికను వేధించిన

వ్యక్తికి 14 రోజుల రిమాండ్

ఖానాపూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఓ బాలికను వేధించిన కేసులో ఒక వ్యక్తికి ఖానాపూర్ కోర్టు 14 రోజులు రిమాండ్ విధించి నట్లు స్థానిక ఎస్సై రాహుల్ గైక్వాడ్ పేర్కొన్నారు. సోమ వారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశా రు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన గోల్కొండ బిగ్గు అలియాస్ వినీత్ అనే వ్యక్తి ఓ మైనర్ అమ్మాయిని వెంటపడి పెళ్లి పేరిట వేధిస్తున్నారని ఆ అమ్మాయి తల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసు కుని విచారణ చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేసి సోమ వారం ఖానాపూర్ జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి నిందితుడికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి

ముథోల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక నాగార్జున నగర్‌కు చెందిన శృంగారె దత్త(65) తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ సోమ వారం వేకువ జామున మృతి చెందాడు. ఎస్సై సంజీవ్ కుమార్ కథనం ప్రకారం... ఉదయం ఇంటి నుంచి బస్టాండ్‌కు వెళ్తుండగా గ్రామ పంచాయతీ వద్ద భైంసా డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రుడిని ముందుగా భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిర్మల్ కవికి గురుబ్రహ్మ అవార్డు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ కవి అంబటి నారాయణకు గురుబ్రహ్మ 2024 అవార్డును మదర్ థెరిస్సా సోషల్ వెల్ఫేర్ విశాఖ సంస్థ ప్రకటించింది. ఉత్తమ బోధన, సామాజిక సేవ, కవిగా సేవలందించినందుకు ఈ అవార్డు ప్రకటిస్తున్నట్టు సంస్థ అధ్యక్షుడు కృష్ణమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలో ఈయన అవార్డు అందుకోనున్నారు. నిర్మల్ సాహితీ ప్రియులు హర్షం వ్యక్తం చేశారు.